రమణ మహర్షి

షంసా అయితాల

అనువాదం
భీమ్‌సేన్

ప్రధాన సంపాదకులు
ఎల్.ఎస్. శేషగిరి రావు

భారత భారతి పుస్తకమాల
(తెలుగు సంస్కరణ)
3-4-852, బర్కత్‌పురా, హైదరాబాద్-27.

రమణ మహర్షి

రచన

షంసా అయితాల

అనువాదం

భీమ్‌సేన్

ప్రధాన సంపాదకులు

ఎల్.ఎస్. శేషగిరి రావు

భారత భారతి పుస్తకమాల

(తెలుగు సంస్కరణ)

3-4-852, బర్కత్‌పురా, హైదరాబాద్-27.

ప్రచురణ కర్తలు
నవయుగభారతి ప్రచురణలు
పోస్ట్‌బాక్స్ నెం. 1041
నారాయణగూడా, హైదరాబాద్ - 500 029.

తెలుగు సంస్కరణ సంపాదకులు
టి. హరిహర శర్మ

ప్రథమ ముద్రణ : నవంబర్, 2002

వెల: రూ. 8.00

ప్రతులకు

సాహిత్యనికేతన్
3-4-852, బర్కత్‌పురా
హైదరాబాద్ - 500 027
ఫోన్ : 2756 3236

సాహిత్యనికేతన్
ఏలూరు రోడ్
విజయవాడ - 520 002
ఫోన్ : 2667421

ఇది మా మాట

కేవలం భారతదేశంలోనే కాక, మొత్తం ప్రపంచంలోనే ప్రఖ్యాతులైన మన పూర్వీకులను స్మరించడం, వారి జీవితాలను అధ్యయనం చేయడం ఎల్లప్పుడూ ప్రేరణదాయకంగాను, మార్గదర్శకంగాను ఉండగలదనడంలో సందేహం లేదు.

మన చరిత్రకే వన్నెతెచ్చిన ఆ మహనీయుల జీవితాలను సరళమైన, ఉత్తేజకరమైన భాషలో ప్రజలకందించే చక్కని ప్రయత్నాన్ని రాష్ట్రోత్థాన పరిషత్, బెంగుళూరువారు ప్రారంభించారు.

"నవయుగభారతి" ఆ పుస్తకాలను తెలుగులోకి అనువదించే బృహత్కార్యాన్ని చేపట్టింది. భారత భారతి పుస్తకమాల రూపంలో మీ చేతుల్లో ఉన్న పుస్తకాలు ఆ ప్రయత్న ఫలితమే. మన చరిత్రలోని మహాపురుషుల జీవితాలు ఈ పుస్తక మాల ద్వారా మీకందించబడతాయి.

అమరమైన, అనంతమైన మన గత చరిత్ర అనే అమృత స్రోతస్సును తరువాతి తరానికి అందించగలుగుతున్నామనే సంతృప్తితో ఈ పుస్తకాలను మీముందు పెడుతున్నాం. మీరు కూడా ఈ కృషిని ప్రశంసించగలరని, ప్రోత్సహించగలరని ఆశిస్తాను.

మూలరచనను సరళమైన, ఆహ్లాదకరమైన రీతిలో తెలుగులోకి అనువదించిన అనువాదకులకు ధన్యవాదములు.

– హరిహరశర్మ
సంపాదకులు

రమణ మహర్షి

పరమపవిత్రమైన మన భారత దేశంలో
అనేకమంది మహాపురుషులు, వీరమాతలు
జన్మించారు. వేదకాలం నుండి నేటిదాకా
అసంఖ్యాకులైన ఋషిపుంగవులు, సిద్ధ పురుషులు,
సాధుసంతులు ఇక్కడ జన్మించారు. అట్టి
మహాపురుషుల్లో కొందరు అడవుల్లో జీవిస్తూ,
ఘోరమైన తపస్సు చేస్తూ సత్యాన్ని దర్శించి జ్ఞానాన్ని
ఆర్జించారు. ప్రపంచ ఆధ్యాత్మిక వికాసానికి
తమవంతు కృషి సల్పారు. అనేకమంది
మహాపురుషులు ప్రజలకోసం, దేశంకోసం తమ
జీవితాల్ని సమర్పించారు. వారు ప్రజలమధ్య జీవిస్తూ
వారి సుఖదుఃఖాలలో పాలుపంచుకునేవారు.
సామాజిక ప్రగతికోసం పాటుపడ్డారు. సామాన్య
ప్రజలమధ్య జీవిస్తూ, వారి కష్టసుఖాలలో
పాలుపంచుకున్న మహర్షులలో
రమణ మహర్షి ఒకరు.

బాల్యం

రమణ మహర్షి డిసెంబర్ 30, 1879 వ సంవత్సరంలో తమిళనాడులో మధురైకి 40 కిలోమీటర్ల దూరంలోని తిరుచులి అనే గ్రామంలో జన్మించారు. తిరుచులి గ్రామంలో ఒక వీధిలో దేవాలయం పక్కనే ఉన్న ఒక ఇంట్లో సుందరం అయ్యర్ అలగమ్మాళ్ అనే దంపతులు కాపురముండేవారు. దంపతు లిద్దరు భగవద్భక్తి, దయాగుణం కలిగి ఆదర్శంగా జీవిస్తుండే వారు. వారికి కలిగిన ముగ్గురు సంతానంలో వెంకట రమణ రెండవవాడు. వెంకట రమణ పుట్టిన రోజున ఆ ఊరిలో జాతర (తిరునాళ్ళు) జరుగుతున్నాయి.

వెంకట రమణ బాల్యంలో విశేషంగా చెప్పుకోదగ్గ సంఘటన లేవీ లేవు. మిగతా పిల్లల్లాగే బడికి వెళ్తూ చదువుకునే వాడు. వెంకటరమణకి 12 ఏళ్ళు నిండే నాటికే అతని తండ్రి సుందరం అయ్యర్ మరణించాడు. భర్త మరణంతో రోజులు గడవక అలగమ్మాళ్ తిరుచులి గ్రామాన్ని విడిచి వెళ్ళక

తప్పలేదు. ముగ్గురు కొడుకులను వెంట బెట్టుకుని మదురైలో వుంటున్న తన మరిది సుబ్బారావు ఇంటికి వెళ్ళింది. మధురై లోని మిషన్ హైస్కూల్‌లో వెంకటరమణ చదువు తిరిగి మొద లైంది. కాని వెంకటరమణ దృష్టి చదువుపై నిలకడగా లేదు. చదవటం, కంఠస్థం చేయటం అంటే అతనికి విసుగ్గా ఉండేది. ఏమాత్రం ఇష్టపడేవాడు కాదు. చదువు విషయానికి వచ్చేసరికి సోమరిగా ఉండేవాడు. రమణను ముస్తాబు చేసి పాఠశాలకు పంపడమంటే తల్లికి ఓ పెద్ద పనయ్యేది. అయినా రమణుడు దృఢమైన శరీరంతో, మంచి తేజస్సు ఉట్టి పడే ముఖంతో ఆరోగ్యంగా బలంగా ఉండేవాడు. స్నేహితులందరూ వెంకట రమణను చూచి భయపడేవారు. వెంకటరమణ గాఢమైన నిద్ర అందరినీ ఆశ్చర్యపరిచేది. అతని నిద్ర గురించి అందరూ సరదాగా చర్చించుకునేవారు. అతని నిద్ర ఎంత గాఢమైనదంటే నిద్రిస్తున్నప్పుడు గట్టిగా బాదినా ఉలికేవాడు కాదు. నిద్రిస్తున్న వాణ్ణి ఎత్తుకుని ఎక్కడైనా దూరంగా పడవేసినా మేలుకునే వాడు కాదు. అందుకే మిత్రులందరూ అతణ్ణి కుంభకర్ణుడిగా వర్ణించేవారు. (కుంభకర్ణుడంటే రావణాసురుడి తమ్ముడు. ఏకబిగిన ఆరునెలలు నిద్రపోయేవాడు)

అరుణాచలం ఆకర్షణ

బాల్యంలో సోమరిగా వున్న బాలుడు సన్యాసం స్వీకరించడం అంటే ఆశ్చర్యమే కదా. జీవితంలో కాకతాళీయంగా జరిగే సంఘటనలే ఒక్కొక్కమారు జీవితాన్ని మలుపు తిప్పుతాయి. వెంకటరమణుని జీవితంలో అలాంటి సంఘటనే చమత్కారంగా జరిగింది.

వెంకటరమణ వయసు సుమారు 16 ఏళ్ళు ఉంటుంది. ఒకరోజు సుబ్బారావు అయ్యర్ ఇంటికి ఒక అతిథి వేంచేసాడు. మొదటి పరిచయంలోనే ఆ అతిథి అరుణాచలంనుండి వచ్చినట్లు తెలిసింది. అరుణాచలం పేరు వినగానే వెంకటరమణ విపరీతంగా ఆకర్షించబడ్డాడు. అతనిపైన ఏదో ఒక సమ్మోహన శక్తి ప్రసరించినట్లయింది. అరుణాచలం గురించి ఇంకా అనేక విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం మొదలైంది. ఆ కుతూహలం అతన్ని నిలకడ లేకుండా చేస్తున్నది. మనసులో ఆరాటం ఎక్కువవుతోంది. ఆ జిజ్ఞాసను అతను అణచుకోలేక పోతున్నాడు. ఇంకా ఆ అతిథిని వదిలి పెట్టకుండా "మీరు అరుణాచలం నుండి వచ్చారా? అరుణాచలం ఎక్కడ వుంది?" అని అడుగుతున్నాడు. వెంకట రమణ

జిజ్ఞాసను మెచ్చుకుని "ఔను నేను అరుణాచలం నుంచే వచ్చాను. నీవు తిరువన్నామలై పేరు వినలేదా? ఆ తిరువన్నామలైనే అరుణాచలం అని పిలుస్తారు" అని చెప్పాడు.

వచ్చిన అతిథి వెంకటరమణని బాగా ఆకర్షించాడు. వెంకట రమణ కుతూహలాన్ని బట్టి అతను (ఈ బాలుడు అరుణాచలం తప్పక వెళ్ళి తీరుతాడు) అనుకుంటూ తమిళ పురాణం పెరియ పురాణం నుండి కులాత్తుంగ కవితల్ని చదివి వినిపించాడు. ఆ కవితలలో శైవ సాంప్రదాయానికి చెందిన సాధు సంతుల వర్ణన వెంకటరమణ మనసుపై చెరగని ముద్ర వేసింది. వాళ్ళ జీవిత చరిత్రలు వెంకటరమణ మనసులో ఒక తుఫాను సృష్టించాయి. మెదడులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. హృదయంలో తీవ్రమైన ఆవేదన ప్రారంభమైంది. " నేనూ ఆ సాధు సంతులలాగా అంత ఉన్నతంగా ఎదగగలనా? నా కల నిజమవుతుందా?" అని మనసులో తర్కించుకున్నాడు. అప్పటి నుండి వెంకటరమణ ఏకాంతంలో ఉండడం ఇష్టపడుతున్నాడు. తరచు మౌనంగా కూర్చుని ఈశ్వరుని గూర్చి ధ్యానం చేస్తుండే వాడు.

"నేను" ఈ శరీరమే కాదు

అది 1896వ సంవత్సరం. సంవత్సరంలో సగం రోజులు గడిచిపోయాయి. అప్పటికి వెంకటరమణ వయస్సు 17 ఏళ్ళు. ఒకరోజున తన పినతండ్రి ఇంటి మేడపై ఒక గదిలో కూర్చుని ఉన్నాడు. లోతైన ఆలోచనల్లో మునిగిపోయాడు. ఆరోగ్యం కూడా చాలా బాగా వుంది. వున్నట్టుండి అకస్మాత్తుగా మృత్యు భయం ప్రారంభమైంది. నెమ్మదిగా అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. ఇక తాను చనిపోయాననే అనుకున్నాడు. మృత్యు భయం తనని ఎక్కడ బలహీనుణ్ణి గావిస్తుందో అని ఆలోచించి, మృత్యు భయాన్ని ఆపడానికి ఆత్మచింతన ప్రారంభించాడు. అతడు తనలో తాను ("నేనేమి సాధించాలి? మృత్యువు సమీపిస్తున్నది. నేను మరణిస్తున్నాను. అసలు మృత్యువు అంటే ఏమిటి? ఈ శరీరం నశించి పోతుందా?") ఇక అప్పుడు అతను పూర్తిగా ఊపిరిని బిగబట్టాడు. పెదవిని కళ్ళని గట్టిగా బిగించాడు. భూమిపై శవంలా పడుకుని ఆలోచన ప్రారంభించాడు.

"ఇప్పుడు నా శరీరం చచ్చిపోయింది. ఈ శరీరం నిర్జీవమైంది. నా బంధుమిత్రులు ఈ శవాన్ని స్మశానానికి తీసుకెళ్ళి

చితిమీద పెట్టి కాల్చివేస్తారు. అయితే ఈ శరీరంతో పాటే 'నేను' చచ్చిపోయాను. నేనంటే కేవలం శరీరమేనా? ఈ దేహం చలనరహితమైందా? అయితే ఇప్పుడు కూడా నాకు నా పేరు తెలుసు. అమ్మా, నాన్న, చిన్నాన్న, అన్నయ్య, తమ్ముడు, స్నేహితులు, ఇంకా అనేకమంది తెలిసినవారంతా గుర్తుకు వస్తున్నారు. అంటే దీని అర్థం నా వ్యక్తిగత విషయాల స్పృహ ఇంకా నాకున్నది. అంటే ఈ దేహంలో వున్న నేను శరీరంలో వేరుగా వున్నానని అర్థం. ఆ నేను అంటే ఆత్మ శాశ్వతమైనది. దానికి వినాశం లేదు." ఈవిధంగా వెంకటరమణ మెదడులో ఒక అనుభూతి మెరుపుతీగలా మెరిసింది. కాని, ఆత్మ సాక్షాత్కారం అనుభూతి సంవత్సరాల తరబడి తపస్సు చేస్తే కాని లభించదు. ఆ తపస్సులో కూడా ఆకలి దప్పులను, నిద్రని వదులుకొనవలసి వస్తుంది. శరీరాన్ని విపరీతంగా కష్టపెట్టవలసి వస్తుంది. కాని వెంకటరమణునికి ఈ కష్టమేమీ లేకుండా అట్టి జ్ఞానం ప్రాప్తించింది. అతనికిప్పుడు చావంటే భయంలేదు. అప్పటి నుండే వెంకటరమణ కాస్తా 'రమణ మహర్షి'గా ప్రసిద్ధి గాంచాడు.

ఇప్పుడిక వెంకటరమణకు పాఠశాల చదువు, బంధు

మిత్రుల సంబంధ బాంధవ్యాలన్నీ అల్పమైన విషయాలుగా కనపడటం ప్రారంభమైంది. అతను నిరంతరం అరుణాచలంలో ఉన్న అనుభూతినే పొందేవాడు. అతను అత్యధిక సమయాన్ని ఏకాంతంగా ధ్యానంలో గడుపుతున్నాడు. ఈ సాంసారిక ప్రపంచం నుండి దూరంగా వెళ్ళిపోవాలని ఏకాంతంగా బ్రతకాలని ప్రయత్నం ప్రారంభించాడు. అలా ప్రయత్నించి అనేకసార్లు పట్టుబడటం సాధారణమైపోయింది. అలగమ్మాళ్ ఊరంతా వెదికి వెంకటరమణని పట్టుకునిరావటం, అతనికి అన్నపానాదులు సమకూర్చడం నిత్యకృత్యమైంది. తరుచు మీనాక్షి మందిరానికి వెళ్ళేవాడు. అక్కడ దేవి దేవతల గూర్చి తెలుసు కోవడం, సాధుసంతుల మధ్య గడపడం వెంకటరమణకి చాలా ఇష్టం ఉండేది. వెంకటరమణలో వచ్చిన మార్పుని అతని అన్న నిశితంగా పరిశీలించేవాడు.


ఇల్లువదిలిన వెంకటరమణ

1896వ సం॥ ఆగస్టు 29వ తేదీ అప్పటికి ఏడువారాలుగా దివ్యమైన అనుభూతిని పొందుతున్నాడు. పాఠశాలలో ఇంగ్లీషు తరగతిలో ఏ ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పేవాడు కాదు. ఇంగ్లీషు

అధ్యాపకుడు వ్యాకరణ పుస్తకంలో ఒక పాఠాన్ని మూడుసార్లు రాయమని ఆజ్ఞాపించాడు. వెంకటరమణ రెండుమార్లు వ్రాసి మూడోమారు రాస్తుండగా అకస్మాత్తుగా చెయ్యి రాయటం మానేసింది. ఈ పాఠాన్ని చూచిరాతగా రాయటంవల్ల లాభం ఏమిటి? అనే ఆలోచనలో పడి పోయాడు. ఇదంతా వ్యర్థం అన్న ఉద్దేశ్యంతో పుస్తకం, పెన్ను పారవేసి భగవంతుని ధ్యానంలో మునిగిపోయాడు.

వెంకటరమణ ఈ విచిత్ర ప్రవర్తనని చూచి ఉపాధ్యాయునికి ఏమిచేయాలో అర్థం కాలేదు. ఈ బాలుణ్ణి ఎలా దారికి తేవాలా అని తలకి చేతులు పెట్టుకుని కూర్చున్నాడు. వెంకటరమణ ధ్యాస అంతా అరుణాచలంపై ఉంది. ఒకవేళ తాను ఇల్లు వదిలి అరుణాచలం వెళతానని ఇంట్లో చెప్తే ఇంట్లో తనను బలవంతంగా కట్టిపడేస్తారు అని వెంకటరమణకి తెలుసు అందుకే నిశ్శబ్దంగా వెళ్ళిపోవాలని వెంకటరమణ నిశ్చయించుకున్నాడు.

వెంకటరమణ తిరువణ్ణామలై వెళ్ళడానికి కావలసిన రేఖాచిత్రాన్ని సంపాదించాడు. దగ్గరలో ఏస్టేషన్ ఉందో



క్లాసురూములోనే ధ్యాన నిమగ్నుడైన వెంకటరమణ

అక్కడికి వెళ్ళడానికి మూడు రూపాయలు ఖర్చవుతుందని తెలుసుకున్నాడు. తన దగ్గర చిల్లిగవ్వకూడా లేదు. అదృష్టవశాత్తు అదే రోజు తల్లి పెద్దన్నయ్యకు కాలేజి రుసుము చెల్లించడానికి ఐదురూపాయలిచ్చింది. అన్నయ్య ఆ పనిని వెంకటరమణ కప్పగించాడు. మరునాడు కాలేజికి వెళ్ళివచ్చింతర్వాత మధ్యాహ్నం కూడా తనకు ప్రత్యేక తరగతులున్నాయని, అందుకే మధ్యాహ్నం నేను ఇంటికి రానని చెప్పాడు. ఇంటినుండి వెళుతూ అతను ఒక ఉత్తరం వ్రాసి ఇంట్లో ఉంచి వెళ్ళిపోయాడు.

"ఆ ఉత్తరంలో నేను భగవంతుని యొక్క అన్వేషణలో ఇల్లు విడిచి వెళుతున్నాను. మీరు నా గురించి ఏమీ చింతించకండి. నాకోసం వెతకడానికి అనవసరంగా డబ్బులు వృధా చేయకండి. నేను మన కాలేజి రుసుము చెల్లించలేదు. ఆ డబ్బులో నుంచి మూడు రూపాయలు తీసుకుని వెళుతున్నాను. మిగిలిన రెండురూపాయలు ఈ ఉత్తరంతోపాటు ఇక్కడే ఉంచాను."

వెంకటరమణ మధ్యాహ్నం తరువాత ఇల్లు వదలి బయలు దేరాడు. నేరుగా స్టేషనుకెళ్ళాడు. స్టేషన్ చేరుకోడానికి చాలా సమయం పట్టింది. అదృష్టవశాత్తు ఆరోజు రైలు ఆలస్యంగా

వచ్చింది. రైలు గనక సమయానికి వచ్చివుంటే ఆరోజు అతని యాత్ర రద్దయ్యేది. టిక్కెట్టుకు రెండురూపాయలు పద మూడణాలు పోగా మిగతా మూడణాలు దాచుకున్నాడు.

ప్రయాణం

వెంకటరమణ రైలులో కూర్చుని ప్రయాణిస్తున్నాడు. ప్రయాణంలో అతను ఏకాంతంలో కూచోడానికి ఇష్టపడి ఒక మూలగా కూర్చున్నాడు. ఎవరితోనూ మాట్లాడాలనుకోవట్లేదు. కాని పక్కనే కూర్చుని వున్న ఒక మౌల్వి వెంకటరమణను మాటల్లోకి దించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. మౌల్వి నుండి వెంకటరమణ అనేక విషయాల్ని అడిగి తెలుసుకున్నాడు. రైలు తిరువన్నామలై దాకా వెళుతుందని తెలియక టికెట్టు విల్లుపురందాకానే తీసుకున్నాడు. బాగా ఆకలివేస్తోంది. అర్ధణా పళ్ళు కొనుక్కుని ఆకలి చల్లార్చుకున్నాడు. మరునాడు విల్లుపురంలో దిగిపోయాడు. విల్లుపురం నుండి తిరువన్నామలై దాకా కాలినడకన వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. నడక ప్రారంభించాడు. నడుస్తూ నడుస్తూ బాగా అలసి పోయాడు. ఆకలి కూడా బాగా వేస్తోంది. మధ్యలో ఒక హోటల్ వద్ద

ఆగి ఇక్కడ భోజనం దొరుకుతుందా అని అడిగాడు. వేళకాని వేళ భోజనం సిద్ధంగా లేదు. వండి పెట్టడంలో ఆలస్యమైంది. అందాకా అక్కడే విశ్రమించి భోజనం ముగించుకుని రెండణాలిచ్చాడు. హోటలు యజమాని జాలిగుండె కలవాడు. బాలుడి వద్ద ఎంత డబ్బుందని అడిగాడు. వెంకటరమణ రెండున్నర అణాలుందని చెప్పాడు. కాని అతని పరిస్థితి చూచి హోటలు యజమాని హృదయం ద్రవించిపోయింది. అతని డబ్బుతనికి తిరిగి ఇచ్చివేసి, ఎక్కడికి వెళుతున్నావని అడిగాడు. వెంకటరమణ తిరువణ్ణామలై అని చెప్పగానే, అక్కడికి రైలులో వెళితేనే ఉచితమని నడిచి వెళ్ళడం మంచిదికాదని చెప్పాడు. మళ్ళీ రమణ విల్లుపురం స్టేషను వచ్చాడు. అతనిదగ్గరున్న డబ్బు మాంబల్ పట్టు వరకు మాత్రమే సరిపడేలా వుంది. అక్కడి వరకే టిక్కెట్టు కొని ప్రయాణించాడు. మాంబల్‌పట్ స్టేషన్‌లో దిగాడు. అతని వద్ద చిల్లిగవ్వలేదు. కాలినడక ప్రారంభించాడు. ఆకలి దప్పులతోనే పదిమైళ్ళు నడిచాడు. సాయంత్రానికి హరాయిణీ నల్లూరు అనే చిన్న గ్రామాన్ని చేరుకున్నాడు. ఆ ఊరులోని ఒక శివమందిరానికి వెళ్ళి అక్కడ కూలబడి పోయాడు. కూర్చోగానే ధ్యాననిమగ్నుడయ్యాడు.

ఆ స్థితిలో అతనికి ఒక అలౌకికమైన జ్ఞానజ్యోతి దర్శన మిచ్చింది.

మందిరంలో పూజారి బాలుడు ధ్యానంలో ఉండడాన్ని గమనించాడు. అతను మందిరానికి తాళం వేసి వెళ్ళవలసి ఉంది. బాలుడి ధ్యానాన్ని భంగపరచడం ఎలాగా అనే సందిగ్ధంలో పడ్డాడు. కొద్దిసేపు తర్వాత బాలుణ్ణి మేల్కొలిపే ప్రయత్నం చేశాడు. ధ్యానం నుండి మేల్కొన్న వెంకటరమణ ప్రశ్నార్థకంగా చూచాడు. పూజారి తాను అక్కడికి మూడు మైళ్ళ దూరంలో ఉన్న మరొక మందిరానికి వెళ్ళవలసి ఉన్నందున ఈ గుడి తాళం వేయాలి కాబట్టి ధ్యానాన్ని భంగం చేయవలసి వచ్చిందని తెలిపాడు. వెంకటరమణ పూజారిని అనుసరించి కిలూరు గ్రామానికి వెళ్ళాడు. అక్కడ కూడా కూర్చోవడం తోటే ధ్యానమగ్నుడయ్యాడు. పూజారి పూజ ముగించుకుని బయటికి వచ్చి చూచి ఆశ్చర్యపోయాడు. అయినా తప్పని పరిస్థితుల్లో వెంకటరమణను ధ్యానంనుండి మేల్కొలిపాడు. ఆ రాత్రి వెంకటరమణను అదే గ్రామంలోని ఒక శాస్త్రుల వారి ఇంటికి తీసుకువెళ్ళి వారికి అప్పగించాడు.

వెంకటరమణ శాస్త్రులవారి ఇంటిలో అడుగుపెట్టగానే

స్పృహ కోల్పోయి పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత మెలుకువ వచ్చింది. చుట్టూ చేరినవాళ్ళు చాలా కుతూహలంగా చూస్తూ ఉన్నారు. శాస్త్రులవారి ఇంటిలో నీళ్ళు ఇవ్వగా కొద్దిగా తాగాడు. శాస్త్రుల వారికి వెంకటరమణ పట్ల వాత్సల్యం పెరిగింది. ఆ రాత్రి భోజనం ఏర్పాటు చేసి వెంకటరమణను తన ఇంటిలోనే పడుకోబెట్టాడు.

మరునాడు ఉదయాన్నే నిద్రలేచాడు. ఆరోజు శ్రీకృష్ణ జన్మాష్టమి. అతనివద్ద డబ్బులేదు. నడవడానికి బలమూ లేదు. బాగా అలిసిపోయి నీరసించి ఉన్నాడు. అయినా ఇంటినుండి బయలుదేరి కొద్దిదూరం నడిచి ఆగాడు. తాను నిల్చున్న చోట ముత్తుకృష్ణ అనే హరికథా భాగవతార్‌గారి ఇల్లుంది. ఆయన ఒక మంచి గృహస్తు. ఆయన భార్య జాలిగుండె కలిగిన ధర్మాత్మురాలు. ఆకలితో అల్లాడిపోతున్న వెంకటరమణ దీనంగా తినడానికి రొట్టెముక్క ఉన్నదా అని అడిగాడు. వెంకటరమణ ప్రార్థన విని ముత్తుకృష్ణ భార్య ద్రవించి పోయింది. ఈరోజు పండుగరోజు. కూర్చున్న చోటే పుణ్యము లాభము కలిసి వచ్చాయి. ఒక సన్యాసి వంటి బాలకుడు ఇంటిముందు

నుంచున్నాడు. ఇంతకంటే ఇంకేమి కావాలి? అంతా భగవంతుని దయ. ఎంతో వాత్సల్యంతో వెంకటరమణను ఇంట్లోకి పిలిచి కడుపునిండా భోజనం పెట్టింది. అలాంటి భోజనం చేసి ఎన్ని రోజులైందో! వెంకటరమణకి అమితమైన ఆనందం వేసింది.

అక్కడి నుండి మళ్ళీ తన ప్రయాణాన్ని కొనసాగించాలను కున్నాడు. బయలుదేరడానికి ముందు వెంకటరమణ తన చెవులకున్న బంగారు పోగులను తీసి భాగవతార్ చేతులలో పెట్టి నాలుగు రూపాయలీయమని అడిగాడు. భాగవతార్ అవి పరీక్షించి అవి కనీసం ఇరవై రూపాయలు వెలకడతాయని వెలకట్టాడు. ఐనప్పటికి, వెంకటరమణ చేతిలో నాలుగు రూపాయలుంచి, వెంకటరమణ చేతికి ఒక కాగితంపై తన చిరునామా రాసి ఇచ్చాడు. నీకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు నీ బంగారు పోగులు తీసుకుని వెళ్ళవచ్చునని హామీ ఇచ్చాడు. వెంకటరమణ నాలుగు రూపాయలు తీసుకుని ఆనందంగా బయలుదేరాడు. భాగవతార్ భార్య కొన్ని పిండివంటలు మూటకట్టి ఇచ్చింది. వెంకటరమణ దంపతుల దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాడు. భాగవతార్ రాసి ఇచ్చిన కాగితాన్ని

చింపివేసాడు. తనకిక బంగారు పోగులతో పనిలేదు. వాటిని మళ్ళీ అడగాల్సిన అవసరం లేదనుకున్నాడు.

దరిచేరిన నావ

వెంకటరమణ మరునాడు తిరువన్నామలై చేరుకున్నాడు. అతని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తిరువన్నామలైలో అరుణాచలేశ్వర మందిరం వైపు పరిగెడుతున్నాడు. ఆ సమయంలో మందిరం తలుపులు తెరిచి ఉన్నాయి. మందిరంలో కూడా ఎవరూ లేరు. వెంకటరమణ హృదయం సంతోషంతో నాట్యమాడింది.

ఆవిధంగా అతని సుదూర యాత్ర ఆరోజుతో ముగిసింది. తుఫానులో చిక్కుకున్న పడవ సురక్షితంగా తీరాన్ని చేరినట్లనిపించింది. ఆలస్యం చేయకుండా అతడు సన్యాసం స్వీకరించాడు. భాగవతార్ భార్య మిఠాయిలతోపాటు కొంత డబ్బును కూడా మూటకట్టి ఇచ్చింది. వెంకటరమణ ఆ డబ్బుని చెరువులో పారవేసాడు. అతను సుదీర్ఘమైన ఆలోచనలో మునిగిపోయాడు. ఈ దేహమశాశ్వతమైనది. మరి ఈ దేహాన్ని ఆడంబరంగా వుంచడానికి ఎందుకింత తాపత్రయం? అందుకే ఆయన రోజు

స్నానం చేయటం కూడా మానేసాడు. ఆ మందిరంలోనే సాధనలో మునిగిపోయాడు. అతను మందిరం బయటకు కూడా రావటం మానివేసాడు.

కొన్నాళ్ళ తరువాత కొంతమంది ఆకతాయి కుర్రవాళ్ళు వెంకటరమణతో వేళాకోలం ప్రారంభించారు. ఎప్పుడైతే వెంకటరమణ ధ్యానంలో కూర్చునేవాడో ఆ పిల్లలు రాళ్ళతో కొట్టడం ప్రారంభించారు. ఆ తుంటరి పిల్లలనుంచి తప్పు కోవడానికి తాను ధ్యానం చేసే స్థలాన్ని అక్కడినుండి మార్చారు. ఇప్పుడు మందిరం యొక్క భూగృహంలో ఒక చిన్న గదిలోకి వెళ్ళి గుట్టుచప్పుడు కాకుండా ధ్యానం చేయటం ప్రారంభిం చారు. ఆ గదిని పాతాళలింగం అని పిలిచేవారు. కొన్నాళ్ళ వరకు సాధన నిర్విఘ్నంగా కొనసాగింది. కాని ఆ స్థలాన్ని కూడా పసికట్టడంలో ఆ తుంటరి మూకకు ఎంతో సమయం పట్టలేదు. పాతాళ లింగం భూగృహంలోకి చేరి అక్కడ కూడా వెంకటరమణను ఏడిపించటం ప్రారంభించారు. అరుణాచలేశ్వ రంలో శేషాద్రి అనే ఒక వయోవృద్ధ సన్యాసి ఉండేవాడు. అందరూ అతణ్ణి పిచ్చివాడని అనుకునే వారు. అతను వారి

మాటలను లెక్కపెట్టేవాడు కాదు. వెంకటరమణ సాధన చూసి ఈ సన్యాసియే అతనికి కావలసిన మిగతా ఏర్పాట్లు చూసేవాడు. ఈ తుంటరి మూకలనుండి కూడా వెంకట రమణను కాపాడుతూ భోజన సదుపాయం కూడా సమకూర్చేవాడు.

యువ సన్యాసి అయిన వెంకటరమణ సాధన త్వరలోనే అనేకమంది దృష్టిని ఆకర్షించింది. అతనిపట్ల శ్రద్ధ కలిగిన అనేక మంది వెంకటరమణకు కావలసిన సౌకర్యాలన్నింటినీ స్వయంగా ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చేవారు. కాని ఆ యువసన్యాసికి ఇవేవీ పట్టేవికావు. అతను మౌనంగా ఉండేవాడు. అతను ఎవరితోను మాట్లాడేవాడూ కాదు. మాట్లాడ కుండా వుండడానికి అతను మౌనవ్రతమేమీ చేపట్టలేదు. అతనికి ఎవరితోనూ మాట్లాడటం ఇష్టంగా తోచేది కాదు అంతే. ఎంత అవసరమో అంత మాత్రమే మాట్లాడేవాడు. అంతకంటే ఎక్కువ మాట్లాడటం అతను ఏనాడూ ఇష్టపడేవాడుకాదు.

బృందావనం

ఇలాంటి కఠోర సాధన ప్రారంభించి ఆరు నెలలు గడిచింది. తంబి రంగస్వామి అనే ఒక భక్తుడు వెంకటరమణను తన ఇంట్లో

వుండటానికి ఆహ్వానించాడు. యువసన్యాసి ఆ ఆహ్వానాన్ని ఆనందంగా స్వీకరించాడు. రంగస్వామి ఇంటిదగ్గర ఒక అంద మైన తోట వుంది. ఆ తోటకి బృందావనం అని పేరుపెట్టాడు.

బృందావనంలోనే వెంకటరమణ సాధన చేసుకోవటానికి కావలసిన ఏర్పాట్లన్నీ జరిగాయి. సుందర మనోహర రమణీయ ఉద్యానవనంలో వెంకటరమణ ఏకాంత సాధన నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ఏవిధమైన అసౌకర్యమూ లేదు. అక్కడ ఏకాగ్ర చిత్తంతో భగవంతుని అన్వేషణలో మునిగిపోయాడు. కఠోర సాధన ఫలితంగా అతను ఆత్మ జ్ఞానాన్ని పొందాడు. ఆ జ్ఞానమే భగవత్సాక్షాత్కారం కొరకు మరింత జిజ్ఞాసని పెంచింది. అనేక శేషప్రశ్నలు అతని మెదడులో అశాంతిని రేపాయి. భగవంతు డంటే ఎవరు? ఆత్మంటే ఏమిటి? ఆత్మకు – పరమాత్మకు వున్న సంబంధం ఏమిటి? మనిషి చనిపోయిన తర్వాత ఆత్మ ఏమవుతుంది? మరణించిన తర్వాత దేహం నశించినట్టుగా ఆత్మ కూడా నశిస్తుందా? లేక ఆత్మ అమరమైందా? ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధి అవస్థలో అతనికి సంతృప్తికరమైన సమాధానాలు లభించాయి.



నిజమైన మానవత్వం క్షమించుటలో



క్షమించటలోనే వున్నది

వెంకటరమణ సమాధిలోకి వెళ్ళడం ఆపివేసాడు. అతనికి విశుద్ధమైన ఆత్మజ్ఞానం సాక్షాత్కరించింది. ఇక ఇప్పుడతను తన ఏకాంత వాసం మాని లోకకల్యాణం కొరకు పనిచేయాలని సంకల్పించాడు. ప్రజల అజ్ఞానాన్ని దుఃఖాన్ని పోగొట్టి వాళ్ళ సమస్యల్ని తీర్చాలని నిర్ణయించుకున్నాడు. వెంకటరమణ పేరు సుదూర ప్రాంతాల వరకు వ్యాపించింది. ఆయన దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య నానాటికి పెరిగి పోయింది. అరుణాచల మందిరానికి వచ్చే తీర్థయాత్రికులు రమణుని దర్శనం చేసు కోకుండా వెళ్ళేవారు కాదు. ధంబీ రంగస్వామి ఇంటిదగ్గరలో ఒక మామిడి తోట వుండేది. వెంకటరమణ తన నివాసాన్ని మామిడితోటలోకి మార్చాడు.

తల్లికొడుకుల కలయిక

వెంకటరమణకు నిల్లి అప్పా అయ్యర్ అనే చిన్నాన్న వుండే వాడు. వెంకటరమణ తపస్సు చేసినట్లుగా, అతను సన్యాసం స్వీకరించినట్టుగా అతనికి తెలిసింది. వెంకటరమణ తల్లి తన కొడుకును ఎలాగైనా వెంటపెట్టుకురమ్మని నిల్లి అప్పుఅయ్యర్‌ను తిరువణ్ణామలై పంపింది. అతను అరుణాచలం వచ్చి వెంకట

రమణను కలిసి తల్లి కోరిక మేరకు ఊరికి రమ్మని పిలిచాడు. వెంకటరమణ నిర్మోహమాటంగా తాను రానని చెప్పాడు. నిల్లి అప్ప అయ్యర్ నిరాశతో వెనుదిరిగి అలగమ్మాల్‌కు జరిగిన విషయమంతా వివరించి చెప్పాడు.

అలగమ్మాళ్ పుత్రునిమీద మమకారంతో తానే స్వయాన తిరువన్నామలైకి బయలుదేరింది. పెద్దకొడుకు తోడుగా వచ్చాడు. అలగమ్మాళ్‌ని చూడగానే, తల్లి అని స్ఫురించినప్పటికి క్షేమసమాచారం కూడా అడగకుండా నిశ్శబ్దంగా వుండి పోయాడు. అలగమ్మాళ్ కన్నీరు మున్నీరుగా విలపించింది. అయినా వెంకటరమణ చలించలేదు. తల్లి భావోద్వేగాన్ని, పుత్రుని నిర్మోహత్వాన్ని ఒక యాత్రికుడు గమనిస్తున్నాడు. అతనికి తల్లి వేదనపట్ల జాలికల్గింది. అతను వెంకటరమణకు ఒక సలహానిచ్చాడు. 'మీరు తల్లితో మాట్లాడకపోయినా, కాగితంపై వ్రాసి ఆమెకు ఏదో చెప్పవచ్చుగదా! అన్న యాత్రికుని సలహా వెంకటరమణకు నచ్చింది. అతను ఒక కాగితంపై ఈ విధంగా వ్రాసి తన తల్లికిచ్చాడు. అందులో "ప్రతి వ్యక్తి తన ప్రారబ్ధకర్మలననుసరించి పనిచేయాల్సి ఉంటుంది. ఎవరు

ఎంత ప్రయత్నించినప్పటికీ ప్రారబ్ధంలో ఉన్నది మాత్రమే జరుగుతుంది. అసంభవమైన పని ఎన్నటికీ సంభవంకాదు. ఏదైతే జరగాల్సి ఉందో అదే జరుగుతుంది. మీరు ఎంత తలబాదుకున్నా చాలా విషయాలు మీరనుకున్నట్లుగా నెరవేరవు. అందుకే అందరికీ శ్రేయస్కరమార్గమేమిటంటే మనం మన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ పోవడమే." పుత్రుని మాటల్ని చూచి అలగమ్మాళ్ నిరాశ, నిస్పృహకు లోనయ్యింది. బరువెక్కిన గుండెతో వెనుదిరిగింది.

పెరుగుతున్న భక్తుల సంఖ్య

కొన్నాళ్ళ తర్వాత వెంకటరమణ మామిడితోటను వదలి అరుణాచల కొండపైకి వెళ్ళాడు. అక్కడ విరూపాక్ష మందిరంలో తన స్థావరాన్ని ఏర్పరచుకున్నాడు. అక్కడే తన సాధనను ప్రారంభించాడు. అక్కడ కూడా అతన్ని దర్శించుకోడానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఎక్కువమంది భక్తులు అనేక బాధలతో వచ్చేవారే! రమణుల వద్ద శాంతికోసం వేచి ఉండే వారు. మరికొందరు ఆత్మపరమాత్మ జ్ఞానాన్ని తెలుసు కోవాలనే

జిజ్ఞాసతో వచ్చేవారు. ప్రతి వ్యక్తి తనదైన ఒక సమస్యతో వచ్చేవాడు. ఐతే వెంకటరమణ ప్రతి వ్యక్తి సమస్యకు ఆనందకర సమాధానాన్నిచ్చి పంపేవారు. అందుకే భౌతిక జీవనపు సమస్య లతో వచ్చేవారి సంఖ్య ప్రతిరోజూ పెరుగుతూ ఉండేది. ఇక ఆశ్రమంలో జనం సందడి విపరీతంగా పెరిగిపో సాగింది.

వచ్చిన భక్తులలో ఎచ్చమ్మాళ్ అనే మహిళకూడా ఉంది. ఆమె ప్రతినిత్యమూ వెంకటరమణ దర్శనం కోసం వచ్చేది. ఆమె జీవనమంతా దుఃఖమయమే. ఆమె భర్త, కొడుకు ఇద్దరూ చనిపోయారు. ఆ స్థితిలో ఎవరో ఒకరు రమణుల వార్ని దర్శించుకొమ్మని చెప్పారు. ఎచ్చమ్మాళ్ రమణుల ఆశ్రమానికి వచ్చింది. రమణుల దర్శనమాత్రంతో ఎచ్చమ్మాళ్‌కు ఎన్నడూలేని శాంతి లభించింది. ఆమె తన దుఃఖాన్నంతా మరచిపోయింది. ఇక ఆమె తన శేషజీవితాన్ని రమణుల చెంతనే గడపాలని నిశ్చయించుకుంది. రమణులు తమ సాధనలో ఎంతలా లీనమయ్యారంటే అన్నపానాలు, విశ్రాంతి మొదలగు వేటినీ పట్టించుకునేవారు కాదు. ఎచ్చమ్మాళ్ ఆ ఏర్పాట్లన్నింటినీ శ్రద్ధ

చేసిపెట్టే బాధ్యతను తీసుకున్నది. ఇప్పుడామె రమణులసేవలో మునిగిపోయి తన కష్టాన్ని దుఃఖాన్ని మరిచిపోయింది.

1907వ సంవత్సరం సంస్కృతంలో ఉద్దండ పండితుడైన గణపతిశాస్త్రి తిరువణ్ణామలై వచ్చారు. వారు అప్పటికే గణపతి మునిగా ప్రసిద్ధిజెంది ఉన్నారు. వారు జగన్మాతయొక్క అనన్య భక్తులు. ఈ యువ సన్యాయసి వ్యక్తిత్వంలో ఏదో ఒక ఆకర్షణ శక్తి ఉంది. గణపతిముని రమణుల ఆకర్షణ నుండి తప్పించుకోలేకపోయారు. గణపతి ముని స్వయంగా రమణులను దర్శించుకోడానికి వచ్చారు. రమణుల వద్దకు వెళ్లగానే, ఆ మొదటి దర్శనంలోనే ఒక అపూర్వ అనుభూతి. ప్రచండ వేడిమితో ఉన్న మధ్యాహ్నపు సూర్యుని చూచినట్టుగా ఉంది. గణపతి మునికి ప్రతిరోజు మధ్యాహ్నం నుండి సాయంత్రం దాకా సూర్యుణ్ణి తీక్షణంగా చూడడం అలవాటుగా ఉండేది. ఇప్పుడు రమణులు గణపతిమునికి సాక్షాత్తూ సూర్యునిలాగానే కనిపించారు. ఇక గణపతిముని కూడా రమణుల వద్దనే ఉండిపోయారు. చాలా రోజుల వరకు సత్సాంగత్యంలో అనేక విషయాలు చర్చించేవారు. ఈ చర్చల్లో గణపతిమునికి ఉండిన

అనేక సందేహాలు తీరిపోయాయి. ఇప్పుడు గణపతిమునికి స్పష్టమైన భావాలున్నాయి. గణపతి ముని రమణులను కలియడానికి ముందే వేదాంతము, ఉపనిషత్తులను లోతుగా అధ్యనయం చేశారు. అంత చదివినా, తపస్సు అంటే ఏమిటి? అన్న విషయంలో స్పష్టమైన అవగాహన లేదు. ఏ ప్రశ్నలైతే గణపతి ముని మెదడును తొలచివేస్తూ ఉండేవో రమణులు వాటిని సులభశైలిలో అత్యంత సరళంగా సమాధానపరిచారు. అతని అనుమానాలు, సందేహాలు అన్ని తీరిపోయాయి. రమణుల ఈ అలౌకిక గుణగణాల కారణంగానే గణపతిముని రమణులను 'మహర్షి' అనీ, 'భగవాన్' అని సంబోధించడం ప్రారంభించారు. అప్పటినుండే వారు 'రమణ మహర్షి'గా ప్రసిద్ధి పొందారు. గణపతిముని రమణ భగవాన్‌ను స్తుతిస్తూ సంస్కృతంలో స్తోత్రాన్ని వ్రాశారు. అంతేకాదు రమణుల బోధనలన్నింటినీ సంకలనం చేసి 'రమణగీత' అనే గ్రంథాన్ని ప్రచురించారు.

తల్లి- సోదరులు

కొంత కాలం గడచిన తర్వాత అలగమ్మాళ్ పెద్దకొడుకు

చనిపోయాడు. ఆమెకు ఆధారం కరువైంది. ఇక విధిలేక అలగమ్మాళ్ తన చిన్న కొడుకు నాగసుందర్‌ను వెంటబెట్టుకొని తిరువణ్ణామలైకి వచ్చింది. అక్కడికి రాగానే అలగమ్మాళ్ టైఫాయిడ్ జ్వరం బారిన పడింది. అనేక వారాల దాకా జ్వరం తగ్గలేదు. రమణ భగవాన్ తన తల్లికి అన్ని విధాలైన పరిచర్యలు, సుశ్రూష చేశారు. తన తల్లి మంచం ప్రక్కనే కూర్చుని ధ్యానమగ్ను లయ్యేవారు. ధ్యానంలోలేని సమయమంతా తల్లి సేవకే కేటాయించారు. అరుణాచలేశ్వరుని స్తుతిస్తూ ఒక స్తోత్రాన్ని వ్రాశారు. తన తల్లి త్వరలో కోలుకోవాలని ప్రార్థించే వారు.

కొద్దిరోజులకే అలగమ్మాళ్ ఆరోగ్యం పూర్తిగా బాగుపడింది. తన శేషజీవితాన్ని ఆశ్రమంలోనే గడపాలని ఆశపడుతున్నది. రమణుడేమంటాడో! ఎంతకాదన్నా తల్లితల్లే కదా! రమణ మహర్షుల అనుమతి లభించింది. తల్లి ఆనందానికి అవధుల్లేవు. రమణ భగవాన్ భోజన ఏర్పాట్లు తానే స్వయంగా చూడడం ప్రారంభించింది. రమణభగవాన్ తమ్ముడు నాగసుందర్‌కి కూడా సన్యాసాశ్రమ దీక్ష ఇవ్వబడింది. సన్యాసి కాబట్టి పేరు మార్చారు. ఇప్పుడు అతనిపేరు నిరంజనానంద. ఆశ్రమ

వాసులందరూ ఇతనిని చిన్న స్వామిగా పిలిచేవారు. 1922వ సంవత్సరం రమణమహర్షి తల్లి అలగమ్మాళ్ తనువును చాలించింది.

ఆశ్రమం

రమణమహర్షుల శిష్యుల చొరవతో తిరువణ్ణామలై కొండపైన ఒక ఆశ్రమాన్ని నిర్మించి దానికి రమణాశ్రమమని పేరుపెట్టారు. రమణమహర్షుల వద్దకు వచ్చి సేదతీర్చుకునే భక్తులే ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అత్యంత శ్రద్ధతో ఆ ఆశ్రమాన్ని నిర్మించారు.

నిరంజనానంద ఆశ్రమవాసుల ప్రేమాభిమానాల్ని చూర గొన్నారు. క్రమంగా ఆశ్రమంలో ఉండేవారి సంఖ్య పెరుగు తున్నది. అక్కడొక నూతన మందిరం నిర్మించబడింది. ఆశ్రమం అత్యంత వేగంగా ప్రగతి జెందుతున్నది. దేశం నాలుగు చెరగుల నుండేకాకుండా విదేశాల నుండి కూడా సందర్శకులు రావడం ప్రారంభమైంది. విదేశీ సందర్శకుల రాకపోకలు సంవత్సరం పొడవునా జరుగుతున్నది. ఆధ్యాత్మిక జీవనంలో కావలసిన

మార్గదర్శనం, శిక్షణ కోసం వచ్చే శిష్యుల సంఖ్య కూడా నిరంతరం పెరుగుతున్నది. ఇలా సందర్శకులు బారులు తీరి నిలబడుతున్నారు. ఇప్పుడిక రమణాశ్రమం ఒక సుప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధిగాంచింది.

పాశ్చాత్య శిష్యగణంలో ఎఫ్. హెచ్. హంఫ్రీ రమణ భగవాన్‌కు తొలి శిష్యునిగా చేరాడు. హంఫ్రీ 1911లో మద్రాసు ప్రాంతంలో వెల్లూరుకు పోలీసు ఆఫీసరుగా ఉన్నత పదవిలో నియుక్తులై వచ్చారు. అతనికి హిందూ ధర్మం గురించి అధ్యయనం చేయాలని ఆసక్తిగా ఉండేది. గణపతిముని హంఫ్రీకి రమణమహర్షిని కలియవలసినదిగా సలహా నిచ్చాడు. రమణ మహర్షివద్ద హంఫ్రీ హిందూ ధర్మానికి సంబంధించిన అనేక విషయాలపై చర్చించి తన సందేహాలను తీర్చుకున్నాడు. హంఫ్రీకి ఇప్పుడు సంపూర్ణ ప్రశాంతత లభించింది. ఆయన భారతదేశంలో ఏప్రాంతానికి బదిలీ అయినా తరచు రమణ ఆశ్రమాన్ని సందర్శించేవాడు. వచ్చినప్పుడల్లా ధార్మికచర్చల్లో పాల్గొని మరింత జ్ఞానాన్ని సముపార్జించేవాడు. తర్వాత కొద్దిరోజులకు రమణ భగవాన్‌తో జరిగిన చర్చలు, ప్రసంగాల్ని

తన అనుభవాలతో జోడించి ఆంగ్లంలో 'ఇంటర్నేషనల్ సైకిక్ గజట్' పేర గ్రంథాల్ని ప్రచురించాడు. హంఫ్రీ వ్రాసిన గ్రంథాల కారణంగా రమణమహర్షి పేరు అంతర్జాతీయ స్థాయిలో అనేక దేశాలకు పాకిపోయింది. ఆ గ్రంథం ప్రచారమైన ప్రతి దేశంలో, రమణ మహర్షి భావాలకు ఎనలేని ఆదరణ లభించింది. హంఫ్రీ తన గ్రంథంలో ఒకచోట ఇలా వ్రాశారు : "రమణ మహర్షి చిరునవ్వే అత్యంత మనోహరంగా ఉంటుంది. ఆ చిరునవ్వు అందాన్ని మరే వస్తువుయొక్క సౌందర్యంతోనూ సరిపోల్చలేము. వారితో కలిసి గడిపే కొద్ది క్షణాలైనా మధుర మైన ఆనందానుభూతిని కల్గిస్తాయి."

ఆశ్రమంలో దొంగలు

రమణాశ్రమానికి వచ్చే సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరుగుతూపోయింది. అక్కడికి వచ్చేవారందరూ మంచి వాళ్ళనడానికి వీల్లేదు. 1924వ సంవత్సరంలో శిష్యులుగా నటిస్తూ ఒక దొంగల గుంపు ఆశ్రమంలోకి వచ్చింది. వాళ్ళు ఆశ్రమంలో వున్న విలువైన వస్తువులన్నింటిని మూటగట్టు కున్నారు. ఒక దొంగ రమణమహర్షిని కూడా పిడికిలితో

కొట్టాడు. ఇంతలో కొద్దిమంది శిష్యులు ఆ దొంగను పట్టు కున్నారు. వాణ్ణి దండించడానికి మహర్షి అనుమతి కోరారు. అయితే వారందుకు సమ్మతించలేదు. పైగా శిష్యుల్ని సమాధాన పరచడానికి, "పాముయొక్క స్వభావం కాటు వేయడం, తేలు యొక్క స్వభావం కుట్టడం, ఎద్దుయొక్క స్వభావం కుమ్మటం. వీటి సహజ సిద్ధ స్వభావాన్ని దండించటం ఎంత వరకు ఉచితం? అవి అలా చేస్తున్నాయని మనమూ అలాగే చేయటం ఎంతవరకు ఉచితం? మనం వాటికి దూరంగా వుండే ప్రయత్నం చేయాలి. దొంగలు దొంగతనం చేయటం వాళ్ళ సహజ సిద్ధ మైన ధర్మం అని భావించినపుడు మనం వారిని క్షమించడం మన ధర్మంగా భావించాలి. దండించడం సరికాదు. హింసకు ప్రతిగా హింసించడంలో నిజమైన మానవత్వం లేదు. క్షమించడంలోనే మానవత్వం వుంది. అందుకే దొంగను మనం క్షమించి వదిలివేయటం మంచిది" దొంగనుద్దేశించి మాట్లాడుతూ, రమణమహర్షి నీవు నన్ను కొట్టడంలో ఇంకా తృప్తి చెందక పోతే ఇంకా నన్ను కొట్టు, ఇంకా పిడిగుద్దులతో బాదు అన్నారు. రమణమహర్షి యొక్క వాత్సల్య పూరితమైన

ఈ పలుకులు దొంగ హృదయానికి ములుకుల్లా గుచ్చు కున్నాయి. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. పశ్చాత్తాపం పెల్లుబికింది. గద్గద స్వరంతో తన తప్పుని ఒప్పుకున్నాడు. మహర్షి, నాలుగు మంచి మాటలు చెప్పి దొంగను పంపి వేశారు. ఎవరైతే తప్పుచేస్తారో వారు క్షమాపణ చెప్పుకోవటం, ఎవరైతే క్షమాపణ అడుగుతారో వారిని క్షమించటం. ఈ రెండు మహర్షి దృష్టిలో అమూల్యమైన గుణాలు. దొంగలు వెళ్ళి పోయిన తర్వాత మహర్షి నవ్వుతూ "వాళ్ళు నన్నుకూడా బాగానే పూజించారు" అన్నారు.

సమస్త ప్రాణుల పట్ల ప్రేమ

రమణమహర్షి కరుణ అనే గుణం యొక్క మూర్తీభవించిన అవతారం. ఇతరుల కష్టాలను చూచినప్పుడు వారు ద్రవించి పోయేవారు. దుఃఖిస్తున్న వారిని చూచినపుడు రమణ భగవానుడు దుఃఖసాగరంలో మునిగిపోయేవాడు. అందుకే అలాంటివారు వచ్చినపుడు మొదటి కలయికలోనే వారికి రమణమహర్షి ప్రియ బాంధవుడుగా గోచరించాడు. వారు

మనుషులకు మాత్రమే కాదు. పశుపక్ష్యాదులకు కూడా ఆప్త మిత్రులు. రమణాశ్రమం ప్రాచీన ఋషి మునుల ఆశ్రమాన్ని గుర్తుకు తెచ్చేది. ఆవులు, పక్షులు కోతులు వంటి జీవులన్ని ఆశ్రమ వాసులే. అవన్నీ రమణభగవాన్‌కి ఆప్త మిత్రులే. వాటిని ఎప్పుడు "మీరు, తమరు" అని సంబోధిస్తూ గౌరవిస్తూ వుండేవారు. వాటిని ఎప్పుడూ పేరుపెట్టి అరే, ఒరే అని పిలిచే వారు కాదు. లక్ష్మి అనే ఆవు ఆశ్రమ వాసులందరికి ప్రీతి పాత్రమైన శ్రద్ధా కేంద్రంగా వుండేది. ఆశ్రమంలోని పశుపక్ష్యాదులన్నిటికి భోజనము మేత పెట్టేవారు. ఏదైనా పశుపక్ష్యాదుల మరణం సంభవిస్తే వాటి అంతిమ సంస్కారం కూడా అత్యంత ఆవేదనాభరితంగా గంభీర వాతావరణంలో జరిగేది. ఆత్మీయులు చనిపోతే శ్రద్ధాంజలి ఘటించినట్టుగా వాటికీ ఆ తరహా శ్రద్ధాంజలి ఘటించేవారు. మనుషులకు లాగే పశు పక్ష్యాదులకు కూడా అలాంటి అనుభూతులే వుంటాయని భగవాన్ రమణమహర్షి విశ్వసించేవారు. వాటికీ మనుషుల్లాగే కష్టసుఖాలు, సుఖదుఃఖాలు వుంటాయని చెప్పేవారు. అంటే పశుపక్ష్యాదుల పట్ల జాలి కరుణ ప్రేమ

సానుభూతి వంటి మనసుతో వ్యవహరించాలి. ఇది వారి అనంతమైన ప్రేమతో కూడిన స్నేహానికి ఒక మచ్చుతునక మాత్రమే.

రమణమహర్షి తనువును చాలించేవరకు అరుణాచలంలోనే వున్నారు. వారు అరుణాచలం వదిలి ఎక్కడికీ వెళ్ళలేదు. వారి ఆశ్రమ జీవనం సంతోషంగానూ ప్రశాంతంగానూ వుండేది. అనేక మంది సందర్శకులు వారితో కలిసి గడిపేవారు. కొందరేమో ఆశ్రమంలోనే నివాసముండేవారు. ఈవిధంగా ఆశ్రమ కుటుంబం దినదినాభి వృద్ధిచెందుతూ విశాలమైన స్వరూపాన్ని సంతరించుకుంది. ఆశ్రమంలో పరిశుభ్రత, పరిచర్యలు, భోజనము, నివాసము వంటి వ్యవస్థలన్నీ శిష్యబృందాలే నిర్వహించేవి. సాధకులకు కావలసిన ఏర్పాట్లన్నీ ఈ శిష్యులే చేసేవారు.

ఆశ్రమ దినచర్య

ఆశ్రమంలో అనేక విభాగాలు ఏర్పాటు చేయబడ్డాయి. వాటిలో గోశాల, వేదపాఠశాల, ప్రచురణ విభాగం, భాగవత మందిరం ప్రముఖమైనవి. రమణ మహర్షి ఎప్పుడూ పనిచేయ

కుండా వుండేవారు కాదు. వారు ఎప్పుడూ చురుకుగా పనిచేస్తూ వుండేవారు. ఆశ్రమంలోని ప్రతి విభాగంలో వారి జోక్యంతో పనులు జరిగేవి. ముద్రణలోని అచ్చు తప్పులను సరిదిద్దడం మొదలుకొని ఉత్తర ప్రత్యుత్తరం దాకా అంతా స్వయంగా చేసేవారు. ఆశ్రమంయొక్క ప్రతిపనిలో ఎంతో ఇష్టంగా పాల్గొనేవారు.

రమణమహర్షి అరుణాచలం కొండచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పుడు ఒక అలౌకికమైన ఆనందాన్ని పొందేవారు. అరుణాచలం చుట్టూ ప్రదక్షిణం చేయడం వారి దినచర్యలో ఒక భాగంగా వుండేది. ఆశ్రమంలోని ఒక భాగంలో పళ్ళు, పూలు, కూరగాయల మొక్కల్ని పెంచేవారు. ఆశ్రమంలోని ఏవస్తువునూ వృధా చేయడాన్ని ఇష్టపడేవారుకాదు. పూలు కూరగాయల తొక్కల్ని ఆవులకు తినిపించేవారు. రమణమహర్షి కూడా అందరితో కలిసి సహపంక్తి భోజనం చేసేవారు. వారు తమ గురించి ప్రత్యేక వ్యవస్థనుగాని ప్రత్యేక సదుపాయాల్నిగాని ఇష్టపడేవారుకాదు. అసలు తనను ప్రత్యేకంగా చూడడమే వారికి నచ్చేది కాదు.

'రమణ మహర్షి అహింసకు సజీవ ఉదాహరణగా నిలిచే వారు. తన ఆశ్రమంలో పడ్డ దొంగలతో వారు వ్యవహరించిన తీరే అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఎవరైనా వారిపట్ల అనుచితంగా వ్యవహరించినా వారిపట్ల కూడా సానుభూతితో వ్యవహరించేవారు తప్ప పల్లెత్తు మాటనేవారు కాదు. "అలాంటి వారిపట్ల పొరపాటున పళ్ళమధ్య నాలుక పడిపోతే పళ్ళను ఊడగొట్టుకుంటామా? అనేవారు" బుద్ధిమంతులందరూ చెడ్డవారిని ప్రేమతో వ్యవహరిస్తూ వాళ్ళలో మార్పు తేవాలి, సంస్కరించాలని వారు దృఢంగా విశ్వసించేవారు. దోషుల్ని శిక్షించడం బుద్ధిమంతుల లక్షణం కాదనేవారు.

వారి జీవ కారుణ్యం ఎంతటి పరాకాష్టకు చేరుకున్నదంటే ఒకసారి ఒక కోతి మరణశయ్యపై చేరి మరణ బాధను అనుభవిస్తున్నప్పుడు రమణ మహర్షి దానికి సుశ్రూష చేస్తున్నారు. అప్పుడు ఆ కోతి వారి పాదాన్ని గట్టిగా కరిచింది. దాంతో రమణమహర్షి కాలుకి పుండయింది. అయినా కూడా దాన్ని ఏమీ అనకుండా రమణమహర్షి సుశ్రూష చేస్తున్నారు. ఆవిధంగా

పశుపక్ష్యాదులపైన వుండే అవ్యాజమైన ప్రేమ కారణంగా తనకు కలిగే బాధల్ని మరిచేవారు.

లక్ష్మి అనే ఆవు మరణించినప్పుడు దాని శవం పక్కన కూర్చుని ఎంతో విలపించారు. సాక్షాత్తు తన తల్లి మరణించిన వేదనను అనుభవించారు. ఒకమారు రమణభగవాన్ అరుణాచలం కొండమీది ఒక పెద్దబండరాయిపై కూర్చున్నారు. ఒక పాము పాకుతూ రమణభగవాన్ తొడపైఎక్కి మళ్ళీ నిశ్శబ్దంగా అక్కణ్ణించి జారుకుంది. మహర్షి నిశ్చలంగా కూర్చున్నారు. ఇదంతా చూస్తున్న ఒక వ్యక్తి రమణ మహర్షిని "ఏమిటి పాము మీవంటిపైకి పాకి మళ్ళీ దిగిపోతున్నప్పటికి మీకు భయం వేయలేదా?" అని అడిగాడు. అందుకు రమణమహర్షి చిరునవ్వుతో "భయమేమీ వేయలేదు కాని ఏదో ఒక కోమలమైన చల్లని వస్తువు నా శరీరాన్ని స్పర్శిస్తూ వెళ్ళిన అనుభూతిని మాత్రం పొందాను" అని రమణమహర్షి చెప్పారు. రమణ మహర్షి తన ఉపన్యాసాలద్వారా లేదా పుస్తకాల రచన ద్వారా కాని తన భావాల్ని ప్రచారం చేసుకునే ప్రయత్నం చేయలేదు. తన వద్దకు వచ్చే జిజ్ఞాసకుల శిష్యుల సందేహాల్ని సులభమైన రీతిలో


తీర్చేవారు. వారి సమాధానాలు సంక్షిప్తంగానూ వివరంగానూ ఉండేవి. తన శిష్యులకు తర్కబద్ధమైన మార్గదర్శనం చేసేవారు. కలుషితమైన మనోభావాల్ని పరిశుభ్రం చేసుకోవడా నికి ఏకైక మార్గం ఆత్మచింతన అని చెప్పేవారు. ఆ మంగళకర కార్యాల యొక్క మూలాల్ని నిరంతరం గుర్తుచేసు కొనటంద్వారా మన సును విశుద్ధంగా ఉంచుకొనవచ్చునని వారు విశ్వసించే వారు.

ఆశ్రమంలో కులము - వర్ణము - మతము వంటి బేధభావాలకు ఎలాంటి తావులేదు. ఆశ్రమం తలుపులు ఎల్లవేళలా తెరిచి వుండేవి. ఏ ప్రాంతం వాడైనా, ఏ కులంవాడైనా ఎలాంటి జబ్బులతో వున్నా నిరాటంకంగా ఆశ్రమంలోకి వచ్చేవారు. ఆశ్రమంలో ఎవరి ప్రవేశానికి నిషేధం వుండేది కాదు. రమణ మహర్షి సిద్ధాంతం ప్రకారం ప్రజలంతా ఒకే భగవంతుని సంతానం.

ఆఖరి ఘడియలు

1947వ సం॥ రమణమహర్షి ఆరోగ్యం క్రమంగా క్షీణించడం ప్రారంభమైంది. రమణమహర్షికి పౌష్టికాహారం

తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తుండేవారు. కాని రమణ భగవాన్ అలాంటి సలహాలను లక్ష్యపెట్టేవారుకాదు. అందరూ తీసుకునే ఆహారాన్నే వారూ తీసుకునేవారు. భోజనం పట్ల ఈ నిర్లక్ష్యం కారణంగా వారి ఆరోగ్యం మరింత క్షీణించింది. ఎడమచేతి పైన ఒక గడ్డ ఏర్పడింది. పరీక్షలు నిర్వహించిన తర్వాత దాన్ని సర్కోమా అనే జబ్బుగా డాక్టరు గుర్తించారు. శస్త్ర చికిత్సద్వారా ఆ గడ్డను తొలగించారు. కొద్ది రోజుల తర్వాత అదేస్థలంలో మళ్ళీ మరో గడ్డ పుట్టుకొచ్చింది. అప్పుడు మద్రాస్ నుండి ఒక నిపుణుడు వచ్చాడు. ఆగడ్డను పరీక్షించిన తర్వాత, "రమణ భగవాన్‌ను సజీవంగా కాపాడుకోవాలంటే వారి ఎడమచేతిని తొలగించాల్సి వుంటుందని చెప్పారు. మహర్షి దానికి అంగీకరించక "శస్త్రచికిత్స అవసరం ఏమీ లేదు. అసలు మానవ దేహమే రోగాల పుట్ట. అందుకు కేవలం ఈ ఒక్క చేతినే కోసివేయటం ఎంతవరకు సబబు. ఏది ఏమైనా నేను నా చేతిని తొలగించనివ్వను అని స్పష్టంగా చెప్పారు. ఆ చేయి తన చానేదో చావనివ్వండి అంటూ ఎవ్వరి సలహాకి కాని ఒత్తిడికి కాని లొంగకుండా నిలబడ్డారు. డాక్టర్లు



ఈ చేయిని సహజంగానే చావనివ్వండి

మరొక్కసారి శస్త్ర చికిత్స జరిపారు. అయినప్పటికి మహర్షి ఆరోగ్యంలో ఎలాంటి ప్రయోజనమూ కనిపించలేదు. రోజు రోజుకు జబ్బు ముదురుతున్నది. ఆరోగ్యం మరింత దిగజారి పోతోంది. గడ్డ మరింత పెరుగుతూ పోయింది. గాయం మరింత పెద్దదౌతూ వచ్చింది. అయినప్పటికి రమణభగవాన్ విచలితుడు కాలేదు. వారి ముఖంలో ఎలాంటి వేదనా బాధ వ్యక్తం కాలేదు. వీరి వాలకం ఆశ్రమవాసులకి ఆశ్చర్యం కలిగించింది. ఇక వారికి అంతిమ ఘడియలు సమీపించాయని తెలిసి భక్తులు సుదూర ప్రాంతాలనుండి రావడం ప్రారంభ మైంది. మహర్షిని రోగగ్రస్తులుగా చూసి భక్తులు దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు. కాని మహర్షి ముఖంలో ఎలాంటి విషాద ఛాయలు గోచరించేవి కావు. దీనికి విపరీతంగా సృష్టిలో పుట్టిన ప్రతి జీవి మరణించవలసిందే. దేహం అశాశ్వతమైనది, ఆత్మశాశ్వతం కాబట్టి అశాశ్వతమైన దేహం కొరకు దుఃఖించడం తగదు అని వారికి సాంత్వన కలిగించేవారు. భగవాన్ రమణ మహర్షి 1950సం॥ రాత్రి 2 గం॥లకు తన ఇహలోక యాత్ర చాలించారు.

రమణమహర్షి పెద్దగా పుస్తకాలేమి వ్రాయలేదు. వారు ఏమైనా రాసి వుంటే శిష్యులకొరకే వ్రాశారు. వారు పద్యరచన గద్యరచన సమానంగా చేసారు. "నలభై కవితలు" అనే పుస్తకంలో వారి కవితలు పొందుపరచబడ్డాయి. అదేవారి ఉత్తమ రచన. వారు ఉపదేశ సారం అనే పుస్తకాన్ని వ్రాశారు. ఆది శంకరాచార్యులు వ్రాసిన వివేక చూడామణి అనే పుస్తకాన్ని తమిళ భాషలోకి అనువదించారు. వారి రచనలన్నీ తమిళ భాషలోనే అధికంగా జరిగాయి. సంస్కృతం, తెలుగు, మళయాళ భాషలు కూడా వ్రాయగలిగే వారు.

ఒకమారు పాల్‌బ్రెంటన్ అనే ఐరోపా దేశపు శిష్యుడు రమణ భగవాన్‌తో "సాంసారిక ప్రపంచంలో చిక్కుకున్న వ్యక్తికి స్వార్థాన్ని త్యజించటం లేక స్వార్థాన్ని అధిగమించటం సాధ్యమేనా?" అని అడిగాడు. రమణమహర్షి అందుకు "కర్మ మరియు జ్ఞానం పరస్పరం వ్యతిరేకం కావు" అని సమాధానం చెప్పారు. వ్యక్తి తన కార్యంలోనూ వృత్తిలోనూ మునిగి పోయినప్పటికి "నేను, నా సుఖము, నా వైభవము"ల గురించి

మాత్రమే ఆలోచించక అసలు అట్టి భావాలనే మనసులోకి రానివ్వకుండా వుండాలి. నిజానికి నాది నా సుఖము, నా వైభవము వీటిలో నిజమైన సౌఖ్యము లేదు అన్న అవగాహన మనిషికి కలగాలి. నిజమైన సుఖము త్యాగంలోనే వుంది.

ఈవిధంగా భగవాన్ రమణమహర్షి సాధారణ వ్యక్తులకు కూడా ముక్తి మార్గాన్ని చూపించారు.